# కుడిఎడమల దగా.....దగా

ఖానూరు గంగాధర రెడ్డి

సూరీడు కాబూలీ వాలా వడ్డీలా చకచకా పైకి రాసాగేడు. ఇంకా దున్న వలసిన రెండుకొండ్రలూ తొందరగా అవజేసి పొద్దు నడినెత్తి కొచ్చేసరికి ఎడ్లను వదలి వక్కనే వున్న వేపచెట్టునుండి పుల్ల విరుచుకుని తోము కుంటూ యింటిదారి పట్టాడు రాఘవయ్య.

ఇంటికొచ్చి ఎడను చావిట్లో కట్టేసి మేత వేసి, నూతి దగ్గరకెళ్ళి ముఖం కడుక్కుని "ఏంకూర చేశావే వెంకటలక్ష్మి!

కడుపు కాలి పోతోంది త్వరగా తీసు కురా" అంటూ పీటవాల్చి కూర్చున్నాడు.

రాఘవయ్య రెండు ముద్దలు తిని మూడో ముద్ద నోట్లో పెట్టుకోబోతు న్నాడు.

'రాఘవయ్యగోరూ! రాఘవయ్యగోరూ! రచ్చబంత కాడికి మున్సబుగోరూ 'ఆరై గోరూ!' 'తాసిల్దారుగోరూ' వచ్చిన్రు. మీరు తాసీలు కట్టలేదంట గదా. ఎంటనే మిమ్మల్నదకు తీస్కు రమ్మన్నారండి" అంటూ కేకవేశాడు బయటనుంచి ఆవూరి మోతాదు.

"ఏంతాసీలు ఏట్రా! నేనెప్పుడో కట్టి నాను గదరా" ఉప్పుచేప నంజు కుంటూ లోపలనుంచే జవాబు చెప్పాడు!

"మీరు గడితే మున్సబుగోరి కేటండి మళ్ళీకట్టమని చెప్పటానికి ఆరికి మీరంటే ఏంటి కోపముంటాది! రండి రండి అవ నూనుకుందురుగాని" అంటూ తొందర బెట్టాడు మోతాదు మల్లిగాడు.

"వెళ్ళి రారాదా! ఆడు యిప్పటికే మూడుసార్లొచ్చి ఎల్లాడు" అంది వెంకట లక్ష్మి.

"వీళ్ళందరికీ ఏరే పని లేనట్టుంది. తాసీలు కట్టినా కట్టలేదనీ బుకాయించ డము అలవాటయి పోయింది యీ మున్స బుకి" అంటూ లేచి చుట్ట ముట్టించుకుని బయల్దేరాడు రాఘవయ్య.

"ఏం రాఘవయ్యా! ఇంటికో మోతా దును కావలా పెట్టుకోమంటావా యేంటి? ఎన్నిసార్లు పంపాలయ్యా నీకోసం మోతా దును" వ్యంగ్యంగా అన్నాడు మునసబు.

"నేనేడున్నానయ్యా ఇంటికాడ. అరక్కిపోయి ఇప్పుడేగదా వచ్చింది" అన్నాడు రాఘవయ్య.

"కబుర్లు కాకరగాయలూ తర్వాత గాని ముందు డబ్బు కట్టించుకుని రసీదు ఇవ్వవయ్యా" ఆరై మధ్యలో కల్పించు కుని మున్సబు నద్దేశించి అన్నాడు.

"ఇంకా నీ తాసీలు బాకీ మూడొంద లుందయ్యా! డబ్బియ్యి, రసీదు ఇస్తా" అన్నాడు మున్సబు రాఘవయ్యతో.

"తాసీలు బాకి ఏందయ్యో! మొత్తం డబ్బులు తీసుకుని ఇక ఈ సంవత్స రానికి కట్టేపని లేదని చెప్పినావుగదా?" చుట్ట అవతల పారేస్తూ కాస్త కరుగ్గా అన్నాడు రాఘవయ్య.

"చాలు చాల్లే త్వరగా డబ్బుతియ్యి. అవతల ఆలస్యం అయిపోతోంది" కసురుకున్నాడు మున్సబు.

ప్రక్కనున్న తాసిల్దారు గుళ్లో దేవుడి బొమ్మలా చూస్తూ కూర్చున్నాడు.

చుట్టూవున్న తోటి రైతులు శవాన్ని తగలెయ్యడానికి శ్మశానానికి వచ్చిన వాళ్ళలా నిశ్శబ్దంగా నిలబడి వున్నారు.

"ఏటయ్యో నువ్వనేది! నేను డబ్బు కట్టానని ఎన్నిసార్లు చెప్పాలేంటి?" విసు రుగా అన్నాడు రాఘవయ్య.

"అయితే నువ్వు కట్టిన డబ్బుకి రసీ దులు తీసుకురావయ్యా" అన్నాడు 'ఆర్. ఐ.' కల్పించుకుని.

"ఆ కాయితాలు నాకేటి తెలుస్తాయి. నేనేమన్నా సదువుకున్నోణ్ణా యేటి" అన్నాడు రాఘవయ్య మధ్యాన్నపు సూరీడిలా మండిపడుతూ.

"కోపమెందుకు లేవయ్యా! మా మోతాదును వెంటబెట్టుకెళ్లు వాడు చూపి స్తాడు కాయితాలు" అన్నాడు మున్సబు,




"వదవయ్యా బాబు! ఇప్పటికే ఆలిసెమయిపోతాంది" అంటూ మల్లిగాడు రాఘవయ్య ననుసరించాడు.

రాఘవయ్య చూపించిన కాగితాలకట్ట లోంచి మల్లిగాడు రెండు కాగితాలు తీశాడు. ఆ రెండు కాగితాలు తీసుకుని రాఘవయ్య రచ్చబండదగ్గర కొచ్చాడు.

"ఇవే బాబూ ఆ రసీదులు! నాదగ్గర డబ్బులు తీసుకుని మున్సబు ఇచ్చినవి" అంటూ ఆర్రై చేతిలో పెట్టాడు రాఘవయ్య;

''ఇవి పోయిన సంవత్సరం కట్టినవి గదయ్యా"అంటూ ఆ కాగితాలు మున్సబుకు అందించాడు ఆర్రై.

"అవునండి ఇది పోయిన సంవత్సరానివి" అన్నాడు మున్సబు వాటినిచూసి.

"ఏంటయ్యోయ్! ఈసంవత్సరానికని గాదా నువ్వు ఇచ్చింది" అంటూ మున్సబును రెట్టించాడు రాఘవయ్య.

''అట్లాగని నేనేం చెప్పలేదు. ఇక నువ్వెన్ని చెప్పినా-యీ సంవత్సరానికి నువ్వు కట్టవలసిందే" అన్నాడు మున్సబు

"అదేం కుదరదయ్యో నువ్వు యీ సంవత్సరానికనే తీసుకున్నావ్''

''కాదు"

"అవును"

''ఆగండి" కోడెదూడ రంకెలావుంది తాసిల్దారు కేక.

''ఏమయ్యా! నువ్వేమో తాసీలు కట్టానూ అంటావు. మీ మునసబేమో కట్టలేదూ అంటాడు. నువ్వు కట్టావనడానికి సాక్ష్యంగా రసీదులా నీదగ్గర లేవు ఏం చెయ్యాలో నువ్వే చెప్పు'' అన్నాడు తాసిల్దారు.

"సత్తె సెమాణకంగా నల్గురూ నడిచే దారిలో నిలబడి చెబుతున్నా. నేనా డబ్బు కట్టేశాను బాబు, ముత్యాలమ్మ తోడు'' అన్నాడు రాఘవయ్య.

''ఈ ఒట్లూ, వల్లకాళ్ళూ నా దగ్గర

చెల్లవు" తాసిల్దారు గొంతులో చిరాకు. "నీకు యింకా రెండు గంటల టైము యిస్తున్నా. ఈలోపల నీవు డబ్బు లేక పోయావో నీఎడ్లరెండింటినీ జప్తుచేస్తాను" (నాకసలే జప్తులు చెయ్యడం సిగరెట్ తో పెట్టిన విద్య) అంటూ తాపీగా సిగరెట్ వెలిగించు కున్నాడు.

"పద. పద. పెద్దోళ్ళతో వ్యవహారం. కొరివితో ఎందుకు తల గోక్కోవడం" అంటూ రాఘవయ్యను అవతలకు తీసు కెళ్ళి గుస గుసలాడాడు మోతాదు.

o o o

అప్పుడు సమయం మ ధ్యా హ్నం ఒంటిగంట. ఎండ మండిపోతోంది రాఘవయ్యలా! రైతుల గొంతుల మీద తాసిల్దారు కూర్చున్నట్లు సూర్యుడు దేశం నడి నెత్తి మీద తిష్ఠ వేశాడు. రాఘవయ్య వడి వడిగా నడుచుకుంటూ వెళ్ళి

"సావుకారుగోరూ! సావుకారుగోరు" చలమయ్య తలుపు తట్టి పిలిచాడు రాఘవయ్య.

"ఎవురబ్బా! ఇంత ఎండేళప్పుడు! వచ్చి వచ్చి" అంటూ తలుపు తీశాడు చలమయ్య విసన కర్రతో పొట్ట మీద విసురు కుంటూ.

"ఓ-రాఘవయ్య-నీకు నూరేళ్ళాయు వయ్యో! ఇప్పుడే నీసంగతి అనుకుంటు న్నాం. నువ్వే వచ్చావ్" పొట్ట నిమురు కుంటూ అన్నాడు చలమయ్య.

"పెద్దోళ్ళు మీరు. నా బోటోళ్ళ నెందుకు తలుస్తారు లెండి. మాతో మీకేం పనీ-మాబోటోళ్ళకు మీతో పనిగాని" అంటూ పక్కనున్న అరుగు మీద ,చతికిల బడ్డాడు రాఘవయ్య.

"నువ్వు క్రిందటేడు ఆవకాయ పెట్టుకోను కాయలు పంపావు గదా ఈ సంవత్సరం కూడా ఓ రెండొందలిస్తే నీ పేరు మీదుగా వచ్చడి పెట్టుకుంటాము: ఆ సంగతి అనుకుంటున్నాము" అన్నాడు చలమయ్య.

"అట్టాగే పంపిస్తాన్లే. సాయంత్రం నీతో అర్జంటు పనొచ్చి పడిందయ్యా"

"ఏముంటుంది, డబ్బులు పనేగా. ఎంత కావాలేంటి?"అన్నాడు చలమయ్య

"ఆ మన్సబుగోడు తాసీలు కింద మూడొందలూ కట్టించుకుని ఇప్పుడు కట్టలేదంటున్నాడు దొంగతొత్తుకొడుకు. మరలా మూడొందలూ కట్టాల్సొచ్చింది మరి అంతవరకూఇప్పించండి"అన్నాడు రాఘవయ్య.

· "అట్టాగే తీస్కుందువులే" అని. "ఒ రే య్ పె ద్దో డా మీ చినబావ శ్రీరాముల్ని ఇటు రమ్మన్నా" అంటూ ఇంటోకి కేకేశాడు చలమయ్య.

అంటే శ్రీరాములు అని పిలవబడే వ్యక్తి ఏవో కొన్ని కాగితాలు పట్టుకుని పిళ్ళిద్దరి దగ్గరకూ వచ్చాడు.

"ఈయన మా చిట్టిదాని మొగుడు శ్రీరాములు. ఏదో ఇన్సూరెన్సుఏజెంట్ గా చేస్తున్నాడు"అంటూ సదరు శ్రీరాముల్ని పరిచయం చేశాడు చలమయ్య.

"అంటే ఏ ం టం దే" అన్నాడు రాఘవయ్య.

"అంటె జీ వి త భీ మా" అన్నాడు శ్రీరాములు.

"అంటే!" అన్నాడు రాఘవయ్య

ఆశ్చర్యంగా.

"అంటే మన కోపరేటివ్ బ్యాంక్‌కి కట్టినట్లు సంవత్సరానికి ఇంతని ఇరవై సంవత్సరాలు కడతే - తర్వాత మనం కట్టినదానికి రెట్టింపు వస్తుందంటా, - ఒక వేళ దేవుడు తిన్నగా చూడక మనకు ఏదన్నా అయితే మనం మొదట అనుకున్నంతా ఇచ్చేస్తారంట!" అన్నాడు చలమయ్య.

"మామయ్యా! ఈయనతో సంవత్సరానికి వెయ్యిరూపాయలు కట్టి చొచ్చను కుంటాను" అన్నాడు శ్రీరాములు రాఘవయ్యవంక జూస్తూ చలమయ్యతో.

"నాకెందుకులెండి-మట్టి పిసుక్కునే వాడికి ఈ తిరకాసులన్నీ" అన్నాడు రాఘవయ్య.

"కానులు పోగేసుకోమంటే తిరకాసులంటావేంటయ్యా'' అంటూ రూపాయి బిళ్ళలు డబ్బాలోవేసి గలకరించినట్లుగా నవ్వాడు చలమయ్య.

"నాదగ్గర సొమ్ము లేదండి. అదిలేకనే గదా మీకాడకొచ్చింద ఇప్పుడు''

"డబ్బేముందయ్యా! మడిని దగ్గర దగాలేకుండా వుండాలిగాని! అదీ ఇదీ మొత్తం ఎనిమిదొందలు నేనిస్తా నోటు రాని తీసుకెళ్ల'' అంటూ మొహమాటం లాంటి బలవంతం చేశాడు రాఘవయ్యను చలమయ్య.

"తప్పదంటారా" రాఘవయ్య గొంతులో నీరసం ధ్వనించింది-లేకుంటే ఈ మూడొందలుకూడా ఇవ్వదేమోననే అనుమానం.

"ఏదో చిన్నల్లుడు - నీదే జోడీ. నీతోనే వ్యాపారం ప్రారంభం కానియ్యవయ్యా!" అంటూ అల్లుడికి కన్నుగీటాడు చలమయ్య.

మూడొందలు రాఘవయ్య చేతిలోకి రు.500లు ఎల్. ఐ. సి. కాగితాలు శ్రీరాములు సూట్‌కేసులోకి ప్రామిసరీ నోటు చలమయ్య బీరువాలోకి సర్దుకున్నాయి.

ఈ మూడొందలకూ రసీదిస్తూ తనకు యిలా ఎవరెవరి దగ్గర ఎన్ని వందలు మిగిలాయో లెక్కలు వేసుకో సాగాడు మున్సబు మనసులో.

○ ○ ○

వర్షాకాలం మొదలయింది. ఆకుమళ్లు ఏపుగా పెరుగుతున్నాయి. రాఘవయ్య మరికొందరు రైతులు కలిసి కో-ఆపరేటివ్ బాంక్ ప్రసిడెంట్‌నుకలిసి "ఊడ్పుల సీజను వచ్చిందిగదా? మరి మాకేమయినా అప్పులిప్పిస్తారా" అని అడిగాడు.

"ఈ బాంక్ మీ కోసమే గదయ్యా వుంది! రండి! రండి! తప్పకుండా యిస్తాం" అంటూ వాళ్ళను లోపలకు పిలిచి గుమస్తాను ప్రక్కకు పిలిచి ఏదో గుసగుసలాడేడు.

గుమస్తా కావలసిన చోట్లల్లా వేలిముద్రలు వేయించుకుని వచ్చినవలుగురికి తలకో ఐదువందల రూపాయి లిచ్చాడు.

ఎరువులూ అవీ కొని వ్యవసాయపు పనుల్లో పడ్డారు రైతులంతా.

○ ○ ○

అదిగోడి సెంబరు నెల సాయంకాలం. తన

మిరప తోటలో తిరుగుతున్న రాఘవయ్యకు అక్కడక్కడా ఏదో పురుగులు కన్పించాయి

"ఓర్నీ! ఈ పురుగులు కూడా మున్సబు గాడిలాగా తెగబలిసి పోతున్నాయి వీటి అంతు చూడాల. పట్నం బోయి రేపు మందులు తేవాల" అనుకున్నాడు రాఘవయ్య,

తెల్లారిన తర్వాత పక్కనున్న పట్నం పోయి తన వూరి వి.ఎల్. డబ్ల్యు రాసిచ్చిన కాగితం మందుల కొట్టువాడి కిచ్చి మూడు వందల రూపాయిలు విలువైన మందులు తీసుకుని యింటిదారి పట్టాడు.

○ ○ ○

మందు చల్లి మూడు రోజులయినా - పురుగులు చావకపోగా రోజు రోజుకు పెరగడం చూసి మందుల కొట్టువాణ్ని తిట్టుకుంటూ బజార్నపడ్డాడు రాఘవయ్య ఇంటి కొచ్చేసరికి "కోపరేటివ్ బాంక్ గుమాస్తా యిచ్చాడండీ' అంటూ రాఘవయ్య భార్య ఓ కాగితం అందించింది. ఆ కాగితం తీసుకెళ్ళి ఆ వూరి స్కూల్లోని మాష్టారు చేత చదివించుకున్నాడు రాఘవయ్య.

"మీరు తీసుకున్న వెయ్యి రూపాయిలూ వడ్డీతో సహా జనవరి నెలాఖరుకు చెల్లించాలి అని నోటీసండి" అని అన్నాడు మాస్టారు. ఇంతలో యిద్దరు ముగ్గురు రైతులు అదేలాంటి కాగితాలు తీసుకుని మాస్టారి దగ్గరికి వచ్చారు. వాళ్ళవి యిలాంటి నోటీసులే!

అది విన్న రైతులు 'మోసం!' 'దగా!' అని అరుచుకుంటూ ప్రెసిడెంట్ యింటి వైపుగా సాగారు ఆవేశంగా.

"డబ్బు తీసుకునేటప్పుడు 'ప్రెసిడెంట్ మామా' 'ప్రెసిడెంట్ బావా' అంటూ తిరిగి తిరిగి తీసుకుంటారు డబ్బు. మీరలా తిరిగి కట్టాలంటే కళ్ళవెంట నీళ్లు పడతాయి. మీ బుద్ధులే ఇంతరా" అన్నాడు ప్రెసిడెంట్ రౌద్రంగా!

"అయితే మాకు అయిదొందలప్పిచ్చి వెయ్యిరూపాయలు కట్టమని కాగితాలు పంపడం నీకు న్యాయంగా వుందా?"

"దీనిలో న్యాయం అన్యాయం ఏముందిరా? డబ్బు తీసుకున్నట్లు మీరు వేలి ముద్ర వేశారు - ఒకరి కొకళ్ళు జామీన్లు వున్నారుగదా! లేనిపోని అబద్ధాలు చెప్పకుండా డబ్బులు కట్టెయ్యండి" అన్నాడు ప్రెసిడెంట్.

"దగా...దగా....మోసం....మోసం" కోపంతో రుద్రతాండవం చేయసాగాడు రాఘవయ్య!

"అన్యాయం......అన్యాయం........ అక్రమం....అక్రమం" గట్టిగా అరిచాడు రంగయ్య!

"తడి గుడ్డలతో గొంతులు కోయటం అంటే ఇదే" అన్నాడు వెంకయ్య!

"ఆ అలవాట్లన్నీ మీవిరా! అలా చేసేది మీర్రా! అయినా మీతోనాకేమిటి? రేపు పోలీసులు వస్తారు! అప్పుడు చూద్దురుగాని" అంటూ గభాలున తలుపులు మూసుకున్నాడు ప్రెసిడెంట్!

దగాపడ్డ రైతన్నల ఆవేశంలో.... ఆవేదనలో....ఎదురు తిరుగుతున్నాయి గుండెలు!! ★